

# భామమ్మా! నేనూ నీ మనవడినే!!

ఎవి సీతారామమూర్తి

రైలు కదిలింది — రైలుతోపాటు రాం బాబు మస్తిష్కంలో ఆలోచనలూ కూడ కదిలాయి — ప్రయాణానికి పూర్వం జరిగిన సంఘటలనన్నీ జ్ఞప్తికి వచ్చి పెద్ద వేడి నిట్టూర్పు విడిచాడు—

"లాభం లేదు — వెళ్ళి తీరాల్సిందే!" నిశ్చయించుకున్నాడు — ఈ నిర్ణయానికి తను చాలకాలం క్రితమే వచ్చినా ధైర్యం నగపాలు లోపమై వూరుకున్నాడు — యేమైతేనేం! ఉన్నపాటున బయల్దేరాడు.

ట్రైను వేగాన్ని పుంజుకుంది—దూరపు కొండలు అందంగా కన్పిస్తున్నాయి—గాలి రివ్వున వీస్తూంది—

కంపార్టుమెంటులో జనం ఆట్టే లేరు. కొంచెం దూరంలో ఒక పరిమిత కుటుంబం, దారి ప్రక్కనో నలభై యేళ్ళ స్త్రీ—అంతా ఎవరి ఆలోచనల్లో వారున్నారు—ముష్టివాడు ఉడతలు వాయించుకుంటూ పాడుతున్నాడు — దేవునిపై పాటలు సినీ సంగీతంతో మేళవించి మరీ పాడుతున్నాడు!

'చూడు బాబూ! నీ దగ్గిరో పావలా చిల్లరుందా?''

ఎదురుగా కూర్చున్న బామ్మగారడిగారు, రాంబాబు ఆశ్చర్యపోయాడు—పెట్టెలో అందర్నీ చూశాడేగాని అంతవరకూ బామ్మగారు అతని దృష్టిలో పడలేదు—

అరవయ్యో పడిలో పడ్డ బామ్మగారి ముఖమంతా ముడుచుకు పోయింది—తెల్ల గ్లాస్కో పంచ, గ్లాస్కో వాడీ, మెడలో నాలుగు పేటల బంగారపు గొలుసు—చేతికి రెండు జతల బంగారపు గాజులు—

'వుందండి'-అంటూ జేబులోని ఇరవై అయిదు పైసలు తీసి యిచ్చాడు—బామ్మగారు మొలలోంచి పావలా కాసు తీసి యిచ్చారు—ఇంతలోనే ముష్టివాడు బామ్మగార్ని చూసి చేయి చాచడం, బామ్మగారు ఓ పది పైసలు తీసి దానం చేస్తున్నట్లుగా అందరి వైపూ చూసి 'తీసుకుపో' అని వాడి చేతిలో పడేయటం జరిగింది—

ముష్టి వాడేదో దీవించాడు—అరవై యేళ్ళ బామ్మగారిని నూరేళ్ళూ బ్రతకమని! బామ్మగారు సగం సంతోషాన్ని వ్యక్తపరచి మిగిలిన డబ్బులు కొంగున కట్టారు:

'చూడబ్బాయి! నువ్వెంత దాకా వెళతావ్''' మళ్లీ మాట్లాడించారు బామ్మగారు—

''చాల దూరం వెళ్ళాలి లెండి!'' ఎటో చూస్తూ జవాబు చెప్పాడు.

కానీ బామ్మగారు వదిలేట్టు లేరు—ఏమైనా బామ్మగార్ని మంచి చేసుకుంటే మంచి దనిపించింది....

''ఇంతకీ మీ రెక్కడ దిగాలి?'' రాంబాబే ప్రశ్నించాడు—

అంతవరకూ బామ్మగార్నెవరూ మాట్లాడించినట్లు లేదు—బామ్మగారు సర్దుకు కూర్చున్నారు—ఆమె గోడు వినేవాళ్ళు దొరికినట్లుంది—

''నేను భద్రాచలం వెళ్ళి ఆ శ్రీరామచంద్రుడి దర్శనం చేసుకుని వస్తున్నాను బాబూ—విశాఖపట్నంలో దిగాలి అంతవరకూ నువ్వు వస్తావా నాయనా—ఎందుకంటే బొత్తిగా మగ దిక్కులేని దానినయ్యాను—ప్రయాణంలో నైనా కొద్దిగా సాయముంటావని—'' బామ్మగారు ముగించి మరచెంబు మూత తీసి కొంచెం నీళ్ళు తాగి తిరిగి మరచెంబును యథాస్థానంలో పెట్టేశారు — మరచెంబూ, ప్రక్కన కేరేజీ జంటగా తళతళ లాడుతున్నాయి—

''మంచినీళ్ళు కావాలా బాబూ'' బామ్మగారే మళ్లీ ప్రశ్నించారు—

''వద్దండీ—''

''ఇంతకీ నువ్వేం చేస్తున్నావో చెప్పావే కాదు—''

''ఇంకా యేం లేదండీ'' బి. యస్ సీ.

పాసయ్యాను—ప్రస్తుతం ఉద్యోగంకోసం బయల్దేరాను—''

''మంచిది నాయనా—మా రామిగాడు కూడ నీయంతయి వుంటాడు—వెధవ యేం చదివాడో? ఎక్కడున్నాడో యేమో! పెంకి వెధవనుకో—''

''....అంటే మీ....అబ్బాయాండీ ...'' బామ్మగారి మాటలను మధ్యలోనే ఆపి ప్రశ్నించాడు.

''అంత అదృష్టమెక్కడిది నాయనా—నా కడుపునే ఒక కాయకాస్తే యిలా వుంటానా? హాయిగా రాజాలా వాడి పంచన పడుండనూ'' బామ్మగారి ముఖం మబ్బుల క్రమ్మిన ఆకాశంలా తయారైంది—ఆట్టే ప్రశ్నిస్తే వర్షం ప్రారంభమౌతుం దేమోనని భయమేసింది—

రాంబాబు మస్తిష్కంలో చటుక్కున ఓ మెరుపు మెరిసింది—''క్షమించండి బామ్మగారూ—మీ మనసును నొప్పించాను—!'' రాంబాబు చూపిన వినయానికి బామ్మగారు తబ్బిబ్బై పోయారు—

''నా బాబే నా బాబే! ఎంత వినయం! ఆ చదివిన చదువుకి వినయముంటేనే రాణిస్తుందబ్బాయ్! ఏమంటే అను—ఈ కాలం కుర్రాళ్ళు చదువుకున్నారన్న మాటే గాని పెద్దలంటే ఓ గౌరవం, అభిమానం యేడ్చి చావదు—

ఇంతకీ ఉద్యోగం కోసం బయల్దేరావా నాయనా—విశాఖపట్నంలో చాల రకాల కంపెనీ లున్నాయి—నీ చదువు, నీ మంచి తనం చూస్తుంటే చక్కని వుద్యోగం దొరుకుతుం దనిపిస్తోంది!''

''అవును బామ్మగారూ—మీ నోటి చలపవల్ల దొరికితే అదృష్టవంతుడినే—'' అతి వినయానికి ఐసయి పోయారు బామ్మగారు—

''ఇంతకీ మా రామిగాడేం చేస్తున్నాడో యేమో!'' మళ్లీ ప్రారభించారు—

''అప్పట్లో మా తమ్ముడొకడు తాశీలారీ పని చేసేవాడు—పిల్లా జెల్లా లేక పోవడంతో రామిగాడినే చేరదీసి మంచి వుద్యోగం వేయిద్దామనుకున్నాడు—కానీ మంచికి రోజుల్లేవు నాయనా—ఉన్న ఒక్క తమ్ముణ్ని దేముడు తీసుకుపోయాడు—''

బామ్మగారి ముఖం మళ్లీ విషాదంతో అలుక్కుపోవడం గమనించాడు రాంబాబు

''నన్ను చూస్తుంటే ఆయన గుర్తు కొచ్చారా బామ్మగారూ—ఇంతకీ ఆయ నెవరో చెప్పారే కాదు—''

''అవును గదూ—చెప్పనే లేదుస్మీ'' అంటూ బామ్మగారు తేరుకుని చెప్పడం మొదలెట్టారు—

ట్రైను యేదో చిన్న స్టేషన్లో ఆగింది—ఎక్కేవారు ఎక్కారు—దిగే వారు దిగారు—పాటలు పాడే ముష్టివాడు దిగిపోయినట్లుంది—అరటిపళ్ళు ఆసామీ ఒకడు పెట్టె యెక్కాడు—బేరం చేసి ఓ పావలా అరటిపళ్ళు కొని సంచిలో పెట్టారు బామ్మగారు—రైలుబండి కూత కూసి బయల్దేరింది—

''రామిగాడు మా చెల్లెలి మనవడు బాబూ—మా చెల్లెలికి ఒక్కడే ఒక్క కొడుకు—వాడికి పెద్ద చదువు చెప్పించింది అస్థి వుందనుకో. కాని వాడు మిలిట్రీలో జేరిపోయాడు. చాల కాలం ఆ విచారం మా చెల్లెల్ని వీడలేదు అయినా

సరే వాడికి పెళ్ళి చేసింది ఘనంగా. ఆ రోజుల్లో మేమంతా కలిసే వుండేవారిమి. కోడలు, మనవడూ కూడ కొన్నాళ్ళు మా దగ్గరే వున్నారు. తర్వాత రెండో వాడొచ్చి తల్లిని, కొడుకుని, పెళ్ళాన్నీ ఆ వుద్యోగం చేసే దేశమే తీసుకు పోయాడు.

మరో యేడాదికే మా దిబ్బెలు గతిం చిందని టెలిగ్రాం - ఏం చెప్పమంటావు బాబూ మళ్లీ వాళ్లీ దేశమే రాలేదు. నేనా దిక్కులేక ఇలా బ్రతుకుతున్నాను ''

బామ్మగారి మాటలో జీర కన్పిం చింది—

''అదేం మాట బామ్మగారూ! మీకేం? హాయి! చీకూ చింతా లేని జీవితం, ఇంతకీ మీ చెల్లెలుగారి అబ్బాయి పేరేమన్నారు?''

''రామారావు''

''మీ చెల్లెలిగారి పేరు?''

''కామాక్షమ్మ''

''ఆ'' అంటూ ఆశ్చర్యంగా ఆలో చించడం మొదలు పెట్టాడు బామ్మగారి ముఖం ప్రశ్నార్థకంగా మారింది—

''నీకు తెల్సా బాబూ?''

''మా నాన్నగారి పేరూ రాజారావే నండి మిలటరీలో రిటైరయ్యారు మా బామ్మగారి పేరు కూడ మీరు చెప్పిందే అవటం ఆశ్చర్యంగా వుంది. ఇంతకీ యింటి పేరేమిటి?''

బామ్మగారు సంభ్రమాశ్చర్యాలతో తబ్బిబ్బై చెప్పారు.

''కరెక్టు''—అయితే మీరు నా బామ్మ గారన్న మాట!''

ఎంత సంతోషకరమైన వార్త బామ్మా! ఎన్నాళ్ళకు చూడగలిగాను—''

''నువ్వు మా రామానివా నాయనా'' అంటూ రెండు చేతులూ పట్టుకున్నారు—

''అవును బామ్మా! నేను నీ మన వడినే'' ప్రక్కనే జేరాడు

''నాకు వయసొచ్చిన తర్వాత నాన్న అంటూండేవారు. బామ్మగార్ని చూసి రారా అని! ఇన్నాళ్ళకు దేముడిలా కలిపాడు'' బామ్మగారి ముఖంలో ఆనంద విస్మయాలు రెట్టింపైనట్లు గమనించాడు రాంబాబు

''అవును బాబూ మీ నాన్నకు నామీ దెంత అభిమానమో! అన్నట్టు ఎప్పుడు తిన్నావో యేమిటో? యీ రెండూ తిని కాసిన్ని నీళ్ళు తాగు—'' అంటూ సంచి లోని అరటిపళ్ళు అందించారు.

బామ్మ, రాంబాబూ చెరోటి తిని నీళ్ల తాగారు

''బొత్తిగా మనిషివి చిక్కిపోయా వేంరా నాయనా! మీ నాన్న యీ వయ సులో ఎలా వుండేవాడనుకున్నావ్! ఎర్రగా చెయ్యెత్తు ఆజానుబాహువు ఆ మీసాలు, వాడి గాంభీర్యం చూస్తేనే భయమేసేది!

అయినా ఆ రోజుల్లో ఆ తిండేవేరు. అంతెందుకు. మీ నాన్న తిని అరాయించు కున్నట్లు నువ్వు అరాయించుకోగలవా?

పట్టుమని పది యిడ్లీగాని, అరడజను అరటిపళ్ళుగాని తినలేరు—అందుకే మను షులు అలా వున్నారు-మేమా రోజుల్లా అలా తినబట్టే యీ అరవయ్యోపడిలో కూడ యిలా బలంగా తిరుగుతున్నాం— ఏదీ'' మీలో నలభై దాటిన ఒక్కణ్ణి చూపించు—'' ఛాలంజి చేసేలా బామ్మ గారు మాట్లాడుతుంటే ఒక ప్రక్క నవ్వు మరోప్రక్క భయం కలిగాయి రాంబాబుకి-

కంపార్టుమెంటులో వున్న పది మందిలోనూ సగం మంది జోగుతున్నారు మిగిలిన వాళ్ళు బామ్మగారి వేపూ, రాంబాబు వైపూ చూస్తూ బామ్మగారి సోదంతా వింటున్నారు. వాళ్ళంతా తన ధోరణి వింటున్నారని గ్రహించిన బామ్మగారు మరింత ధైర్యంగా చెప్పడం మొదలెట్టారు.

"ఒకటేమిటి! అన్నీ మారిపోయాయి నాయనా-ఈ రోజుల్లో అంతా ఫేషనే! తినే తిండీ, కట్టుకునే బట్టకూడా ఫేషనై పోయింది. సగం వళ్ళు కన్పిస్తూ బట్టలు-ఛీ ఛీ-ఆడవాళ్ళనే సిగ్గుకూడ లేదు! పైగా లోన కప్పుకునే వన్నీ పైటకి కన్పించేలా వుంటాయి. మరి మగాళ్ళు అల్లరి చేస్తున్నారంటే చెయ్యరూ? మగవాళ్ళు మాత్రమేం తక్కువ తిన్నారని కాళ్ళకు బిగుసుకు పోయే పంట్లాలు, మెడలు యిరుకు పట్టేట్లు కాలరు చొక్కాలు-ఎంచక్కా ధోవతులు కట్టుకుని లాల్చి కండువా వేసుకుంటే ఆ రీవి వస్తుందా వీటికి?" బామ్మగారి మాటలు టైట్ ఫేంటులో యిరుక్కున్న రాంబాబుకి సూలాల్లా తగిలాయి పెట్టెలో అంతా అతని వైపే చూశారు. సగం మంది ఆవిడతో యేకీభవించేశారు కూడ!

"పైగా ఎక్కడ చూసినా ప్రేమ రామాయణాలే! ప్రేమ పెళ్ళిళ్ళు ఎక్కువవుతున్న కొద్దీ, అదేదో గవర్నమెంటు ప్రవేశ పెట్టిన సంతాన నిరోధం అమలు జరిపిన కొద్దీ దేశం పాడౌతోందంటే నమ్మండి! అంతకు ముందు యిప్పుడున్నన్ని విడాకులూ లేవు. ఇన్ని రోగాలూ లేవు! అంతా మాయదారి లోకమై పోయిందిప్పుడు పిల్లలు లేరని కొంత మంది ఏడుస్తూంటే వద్దోయని గవర్నమెంటు వాళ్ళ ఏడుపు!" పిల్లలు లేరనే బాధ బామ్మగారి మాటల్లో ఎక్కువగా కన్పించింది. బామ్మగారి నాలెడ్జి అంతా అందరికీ పంచేస్తున్నారనిపించింది. బామ్మగారి నిస్సహాయత మీద జాలి పుట్టింది రాంబాబుకి. ట్రైను అనకాపల్లి చేరనే చేరింది పెట్టెలోకి ఒక అరడజను మంది వచ్చి చేరారు. నిండా బురఖా వేసుకున్న ముస్లిం స్త్రీ వంక అదోలా చూసి మళ్ళీ దృష్టి మళ్ళించుకున్నారు బామ్మగారు.

"బామ్మా! తల నెప్పిగా వుంది కాఫీ తాగుదామా" సాహసించి అడిగేశాడు రాంబాబు-బామ్మగారు కాఫీ తాగుతారో లేదోనని-లేకపోతే మరో లెక్చరు కూడ దంచుతారని భయం కూడా వుంది.

"ఓ అలాగే బాబూ తెప్పించు-ఎంతైనా కాఫీ గతప్రాణులం-" బామ్మగారి మాటలకు కుదుట పడ్డాడు. వెంటనే పెట్టె దిగి తనొక కాఫీ త్రాగి బామ్మగారికో కాఫీ తెచ్చాడు. బామ్మగారు కాఫీ సంతృప్తిగా త్రాగి గ్లాసు యిచ్చేస్తూ "డబ్బు లిచ్చేదా నాయనా!" అన్నారు

"అక్కర్లేదులే బామ్మా! నా దగ్గరున్నాయి-" అంటూ సంతోషంగా డబ్బు లిచ్చి వచ్చాడు

ట్రైను పెద్ద కూ కూసి కదిలింది——

"వచ్చే పెద్ద స్టేషన్ వాల్తేరు బామ్మా?" రాంబాబు మాటలకు. బామ్మగారు నవ్వి "తెల్సు బాబూ నాకీ రైలు ప్రయాణాలేం కొత్త గాదు, అందులోనూ తీర్థయాత్రలు ఒంటరిగా చేసిన దాన్ని. అన్నట్టు చెప్పటం మరిచా-ఆ మధ్య హైదరాబాదు చూదామని వెళ్తే ఎవడో

-యిలాగే ప్రక్కస్టేషనే అని చెప్పి గదీ గగ్రటా రిజర్వు చేయిస్తానని ఉన్న ఒక్క హోల్డాలూ పట్టుకు పోయాడు. దాంతో మరీ జాగ్రత ఎక్కువైంది——'' అంటూ తను తెచ్చిన సామానంతా మరోసారి లెక్కచూసుకుని దగ్గరగా లాక్కున్నారు.

''మరి డబ్బూ అదీ అందులో లేదా బామ్మా!''

''అయ్యో నా పిచ్చి తండ్రీ అంత తెలివితక్కువ పని చేస్తానట్రా-ఓ యాభై మొలలో దోపు కున్నాను మరో వంద వత్తుల పెట్టెలో పెట్టి పట్టుకున్నాను లేక పోతే ముక్కూ మొహం తెలీని ఆ వూళ్లో వారం రోజులెలా వున్నానని '' బామ్మగారు తన ఎక్స్పీరియన్స్ చెబుతూంటే 'బామ్మా నీ ధైర్యానికి నా జోహార్లు' అనుకున్నాడు మనసులోనే రాంబాబు-చూస్తుంటే బామ్మ గారెప్పుడోప్పుడు తనకు సుత్తి పెట్టక మానరని భయపడ్డాడు కూడ-తెలుగు సినీమాలో బక్కలాంటి హీరో చూపిన సాహసం గుర్తుంచుకుని బోలంత ధైర్యం టెంపరరీగా సంపాదించి 'నీకేం భయం లేములే బామ్మా'' అనే హామీ కూడా ఇచ్చే శాడు

బామ్మగారీ హామీలను వినలేదు - పెట్టెలో చివార్న కూచున్న స్లీవ్‌లెస్ నవయువతి పైదృష్టి కేంద్రీకరించారు.

వాల్తేరు వచ్చాక తన సామాన్లు సురక్షితంగా దింపి తను దిగి, రిక్షా పిలిపించి వాణ్ని కసిరి డాబా తోటకి ముప్పావలా యిస్తానని బేరమాడి వాడి నొప్పించారు బామ్మగారు.

రిక్షా లీలామహల్ దాటుతూండగానే అన్నాడు రాంబాబు. ''ఏడాది క్రితం యూనివర్సిటీ పనిమీదొచ్చినప్పుడు యిక్కడే ప్రెండురూంలో వున్నా బామ్మా-అప్పటికీ బంధుత్వం తెలియదుగదా——''

''అయ్యో వెర్రి నాగన్నా - అప్పుడే తెలిస్తే నిన్నలా వుండనిచ్చేదాన్నా-నిక్షేపంలాంటి యిల్లు-హాయిగా వుండే వాడివి-''

రిక్షా అగింది-బామ్మగారు దిగి సామానంతా లోన జేరవేయించి రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించేశారు

పెద్ద మేడ-ముందు జాజిపందిరి-కుడిచేతి ప్రక్కనున్న గది తాళంతీసిలోనికినడిచారు, బామ్మగారు ఆశ్చర్యంగా యింటి నంతా చూస్తూ రేన్‌ఛైర్‌లో కూలబడ్డాడు రాంబాబు.

గది నీటుగా వుంది - రేడియోసెట్టూ. సీలింగ్ ఫేనూ. రెండు గ్యాడ్రెజ్ బీర్వాలు-గోడకు ఒక లైఫ్ సైజు ఫోటో తగిలించి వుంది-దానికో దండకూడ వేలాడదీయబడివుంది ''తాతగారు కామోసు!'' సరి పెట్టుకున్నాడు

''బామ్మా! తాతగారు పోయాక నీకు మిగిలిందీ ఒక్క యిల్లేనా'' భోజనాలయ్యాక తన సంశయాన్ని బైట పెట్టాడు రాంబాబు.

''మరేం నాయనా-తాతగారు పోయే సరికి నువ్వు కడుపులో వున్నావు ఇంటితో పాటు రెండువేల రొక్కం బేంకిలో వేసి పటీ పోయారు మహానుభావులు! ఆ రోజుల్లో ఆయనలా సంపాదించబట్టీ, ముందు చూపు వుండబట్టి సరిపోయింది గాని లేకుంటే నేనిలాబ్రతికుండేదాన్నిట్రా? యేదో ఇంటి మీదో నూట పాతిక అద్దె వస్తుంది. బేంకీ వడ్డీ వస్తుంది ఒంటిదాన్ని యింకేం కావాలిరా!''

"అమ్మ బామ్మా! యింకేం నీకు—"
మనసులోనే ఆశ్చర్యపోయాడు రాంబాబు.

మర్నాడు ప్రొద్దున్నే స్నానంచేసి సైటుపేంటూ. గళ్ళషర్టూ వేసుకుని వూరు మీదికి బయల్దేరాడు రాంబాబు. బామ్మగారికా బట్టలేం నచ్చలేదులా వుంది.

'చూడు నాయనా! ఉద్యోగం కోసం వెళ్ళేటప్పుడు తెల్ల చొక్కా పంట్లాం వేసుకుంటే బావుంటుంది.

"మరేం బామ్మా! నేనూ ఆదే అనుకున్నాను కాని బయల్దేరే వేళకి చాకలి రాలేదు. ఇక్కడ ఏడ్రసు-రాస్తే నాన్న ఓ అయిదొందలు మనియార్డరు చేస్తానన్నాడు బట్టలు కొనుక్కొని మిగిలింది ఉద్యోగ చదిఎంపులకు పొయ్యాలి!" అంటూ బామ్మగారి మాటలకు సమాధానమిచ్చాడు.

తిరిగి యింటి కొచ్చేటప్పుడు బామ్మగారి కోసమో వక్కపొడి పొట్లమూ. నాల్గు బత్తాయి పళ్ళూ కొని తెచ్చాడు.

బామ్మగారి ముఖం సకాలంలో జీతాన్నందుకున్న స్కూల్ టీచరు ముఖమంతైంది

"అందుకే అన్నారు, పెద్దకాలం వచ్చే సర్కిచేసే వాళ్ళు దగ్గరుండాలని. మన డివిగాబట్టి నీకా అభిమానముంది, మరొహాడికి కావాలా చెప్పు, నాల్రోజులుండి తిని పోవడం తప్పితే! ఈ విషయంలో మాత్రం అనుభవం మీద చెబుతున్నా-చుట్టాలకీ పశువులకీ తేడా లేదు. ఎక్కడ పచ్చగా వుంటే అక్కడచేరి తిని పోతారు. నువ్వు మరోలా అనుకోకు బాబూ. ఇన్నాళ్ళకి ఆ దేముడికి కృప వుండబట్టి విడి పోయిన మీరు మళ్లీ కలిశారు"

అంటూ గుడ్లంట నీ రెట్టుకున్నారు బామ్మగారు

రాంబాబుకి బామ్మగార్ని చూస్తే జాలేసింది.

భోజనాల దగ్గర కొచ్చాక - "కొత్తావకాయ తీయను బాబూ! ప్రయాణపెడిలో మరింత వేశని తీయలేదు." అంటూనే జాన దగ్గరకు నడిచారు బామ్మగారు. బానకి కట్టిన గుడ్డని. బామ్మగార్నీ చూస్తే ముళ్ళపూడి వారి కథ గుర్తుకొచ్చింది రాంబాబుకి. కొత్త గదా అని ఒత్తుగా కలుపుకుని ఒక్క ముద్ద మింగేసరికి నసాళానికి అంటుకుపోయి భానుమతిగారి అత్తగార్ని గుర్తుచేసిందామె ఆవకాయ. బామ్మగారి ముందు మరేం మాట్లాడలేక పైగా పొగిడి లేచి చక్కా వచ్చాడు—

రాత్రి డాబా మీద పక్కలేశారు బామ్మగారు. దూరంగా వున్న కె. జి హెచ్. నుండీ, హార్బర్ నుండి లైట్లు అందంగా విరజిమ్ముతున్నాయి

"ఆ పెద్దాసుపత్రిని చూస్తే భయమేస్తుంది నాయనా: దూరానికి ఎంత ముచ్చటగా వుంటుందో అడుగు పెడితే అంత విస్మృతం—" అంటూ మంచం నడుం వాలేశారు బామ్మగారు.

"ఆ మధ్య నాకు మలేరియా వచ్చి ప్రాణం మీదికొస్తే అందరూ కల్సి ఆస్పత్రిలో చేర్చారు. వారం రోజులు! నరకమే నయమనుకున్నామ," అంటూ అక్కడి మనుషులనీ, లంచాలనీ తిట్టిపోస్తే గాని నిద్దర పట్టలే దావిడకి—

మర్నాడు భోజనాని కొస్తూనే అడిగాడు రాంబాబు—

"బామ్మా నాకు పరియార్డ రొచ్చిందా" అని—

లేదని చెప్పారు బామ్మగారు—

"ఎలా బామ్మా రేపే యింటర్వ్యూ. ఇప్పటికి నాన్న డబ్బు పంపలేదు అంత డబ్బుంది. ఎందుకు? సమయానికి విని యోగపడనప్పుడు. నాతో కూడ తెచ్చు కుంటానంటే పోతుందని భయం. ఛ ఛ."

"వాడి కెన్ని పనులున్నాయో ఏమో నాయనా. ఆలస్యమైనా పంపుతాడు. వాడి సంగతి నాకు తెల్సు బాబూ!" మనవడు విసుక్కోవడం చూసి మందలించారు బామ్మగారు,

"ఎప్పుడో ఎందుకు? జరిగే పనంతా రేపు జరిగిపోవాల్సిందే. ఒక వెయ్యి ఖర్చు పెడితేగాని ఉద్యోగం రాదు. ఆ ఉద్యోగ మొచ్చిందా నెలకు ఐదొందులు జీతం! హాయిగా వుండొచ్చు" రాంబాబు మండిపడ్డాడు

"ఐదొందలనేసరికి బామ్మగారి ముఖం వికసించింది. మనవడు ప్రాజ్ఞుడయ్యాడని ముద్దులాడారు

"పోనీ నాయనా. నా దగ్గరున్న డబ్బు తీసుకెళ్ళు నాన్న పంపగానే నాకిద్దూ గాని—" బామ్మగారి మాటలు మనసు లోంచి వచ్చాయని గ్రహించాడు

"నీ డబ్బెందుకులే బామ్మా. లేకపోతే యేమో! చచ్చేటప్పుడు తీసుకుపోతామా యేం?" రాంబాబు ఆవేశానికి అడ్డు బామ్మగారు!

"ప్రస్తుతానికి అవసరం గదా! నాయనా తీసుకెళ్ళు. నేను మాత్రం యేం చేసుకో వాలి గనుక- నాకూ పెద్ద వయసొచ్చే సింది. మగదక్షత కావల్సినదాన్ని- నీ కుద్యోగమొస్తే యిక్కడే వుండిపోదూ గాని- ఇన్నాళ్ళూ యీ ఆస్తికోసం బెంగ పడేదాన్ని ఇప్పుడా భయంలేదు. మీ నాన్న నోసారి పిలిచి అది కాస్తా నీ పేర రాస్తే మనసు కుదుటపడుతుంది—" బామ్మగారిలా చెబుతుంటే నిజంగానే ఆశ్చర్యపోయాడు రాంబాబు!

"నా కెందుకు బామ్మా చూద్దాంలే:" అనేశాడు.

మర్నాడు ఉదయం రడీమేడ్ షాపు కెళ్ళి రెండు జతలు బట్టలు కొను కొచ్చాడు బామ్మగారి బలగంతం మీద. తెల్ల బట్టలు వేసుకుని బామ్మగారిచ్చిన వేయి రూపాయలూ కళ్ళ కద్దుకుని జేబులో పెట్టి జేబుకు పిన్ను గుచ్చాడు.

"వెళ్ళిరా నాయనా. శుభం కలుగు తుంది. ఉద్యోగమయ్యాక ఆ మూడు ముళ్లూ కూడా యీ ఇంట్లో నా కళ్ళ ముందు జరిపిస్తే నాకింకేం కావాలి!" అంటూ దేముడి గదిలోకి దారితీశారు బామ్మగారు—

మళ్లీ వచ్చి చూసి ఆశ్చపోయారు. గదిలో రాంబాబూ లేడు. పెట్టాలేదు. సాయంకాలం వరకూ చూశారు. రాత్ర యింది. కానీ మనవడి జాడేలేదు. ఈ సారి బామ్మగారు నిరాశ పడిపోయారు. ఎలా సరిపెట్టుకోవాలన్నా సరి పెట్టుకోలేక పోతున్నారు,

రాత్రి జ్వరమొచ్చినట్లు కూడ అయింది. పీడకల కూడ యేదో వచ్చింది. ఎవరితో చెప్పటానికి యేమి తోచలేదు. బామ్మగారి మనసు గాయపడింది. అరవై యేళ్ళ వయ సులో తిన్న యింత పెద్ద దెబ్బ ఎప్పుడూ తినలేదు.

రోజు-నడుస్తూన్నా రాంబాబు వస్తాడనే ఆశ బామ్మగారి మనసు నుండి తొంగి పోలేదు.

ఎప్పుడూ ఉత్తరాలూ రాని బామ్మ గారికి ఒరోజు ఓ ఉత్తర మొచ్చింది. బామ్మగారిలో సంతోషం అవధులుదాటింది. తను వూహించింది. నమ్మినదీ పొల్లు కాలే దనిపించింది.

బల్ల మీదున్న కళ్ళద్దాలు పెట్టుకుని సావకాశంగా కూర్చుని కవరు విప్పి— చదవడం మొదలుపెట్టారు.

గం॥ భా॥ స॥ బామ్మగార్కి—

నా గురించి మీరు వెతికి చాల బెంగ పెట్టుకుని వుంటారు. మీ పట్ల నేను చాల అపచారాన్నే చేశాను. మిమ్మల్ని మోసం చేయడానికి సాహసించానంటే దానికి కారణం నా పరిస్థితులే—

నేను మీ రామూన్ని కాదు. ఆస్థి కూడా లేదు. నేను చాల బీద కుటుంబంలో పుట్టాను.

తల్లీ తండ్రీ అందరూ వున్నారు— కానీ నేను దురదృష్టవంతుడిని-మూడోసారి కూడా పియూసీ తప్పాను-ఇంట్లో అం దరూ నానామాటలూ అన్నారు-ఒక పురు గును చూసినట్లు చూడ్డం మొదలు పెట్టారు—

నాలోని పట్టుదల, కోపం పదింత లయ్యాయి-చెప్పా చెయ్యకుండా ఓరాత్రి బయల్దేరాను—

నా ప్రయాణాన్ని నిర్ణయించుకోక మునుపే మీరు కలిశారు-మిమ్మల్ని చూశాక మీకోరిక ప్రకారం మీకు తోడుగా సహక రించాలనుకున్నాను-కానీ నాలోని స్వార్థం నన్ను రెచ్చగొట్టింది-మీ మనవడిపై మీకున్న అభిమానాన్ని గారాబాన్నీ అర్థం చేసుకుని ఆ స్థానంతో కొద్దిరోజులైనా సుఖపడాలని మీతో అబద్ధం చెప్పాను— అందుకు నన్ను క్షమించండి—మీరు చూపిన ఆదరాభిమానాలు మరువలేనివి—

మీ దయవల్ల ఓ చిన్న ఉద్యోగాన్ని సంపాదించుకున్నాను-వీలుంటే మీరుణం ఈజన్మలోనే తీర్చుకోవాలనే వుంది-

యేది యేమైనా మీరు నాకు బామ్మలేని లోటు తీర్చారు-మనసారా మీ మనవడిని క్షమిస్తారని తలుస్తాను-

నమస్కారాలతో—

—రాంబాబు"

ఉత్తరం పూర్తిచేసిన బామ్మగారిలో కదలికలేదు. ముఖంలో యేభావాలు వ్యక్తం కాలేదు—

"లోకం మారింది స్మీ!" అన్నట్లు ముక్కుమీదికి జారిన కళ్ళద్దాలలోంచి శూన్యంలోకి చూస్తూ మౌనంగా వుండి పోయారు. పాపం బామ్మగారు!!!

---

● ఒక ప్రముఖ నాయకుడు రెండు గంటలసేపు అనర్గళంగా ఉపన్యాసం ఇచ్చి "ఎవరికైనా సందేహాలుంటే అడగవచ్చు" అన్నాడు. సభలో నుంచి ఒకడు లేచి "అయ్యా! ఇంతవరకు మీరు మాట్లాడింది దేన్నిగురించో సెలవిస్తారా" అని అడిగాడు.

● దువ్వెన: కొందరు యువకులు జుట్టు అందంగా చెరుపుకోడానికి ఉపయో గించేది.